విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 23 ఆగస్టు 2024 8 పేజీలు

మగువా...!నీ చేతుల్లోనే రక్షణ..

- కలవర పెడుతున్న మృగాళ్ల లోకం...
- అతివలకు శాపంగా అవగాహన లోపం....
- చుట్టూ మేకవన్నె పులులు....
- ప్రజలు ప్రభుత్వ భాగస్వామ్యంతోనే అడ్డుకట్ట....
- మూకుమ్మడిగా మహిళలకు భరోసానిద్దాం....

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: నిర్భయ... దిశ... హథ్రాస్... చేదు జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉండగా... ఇప్పుడు కోల్‌కతా యువ వైద్యురాలిపై జరిగిన అమానుష ఘటనతో మహిళల భద్రత అంశం మరోసారి తెరపైకి వచ్చింది.వారి రక్షణకు చట్టాలు తెచ్చామని ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్నా... క్షేత్రస్థాయిలో పసిపిల్లలపై అఘాయిత్యాలు, పని ప్రదేశాలలో లైంగిక వేధింపులకు అడ్డుకట్ట పడటం లేదు. సమాజంలో మార్పు రానంత వరకు ఈ ఆకృత్యాలకు అడ్డుకట్ట పడదని మహిళా, ప్రజా సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కేవలం మహిళలు మాత్రమే కాదు.. చిన్నారులు, విద్యార్థినుల పైనా లైంగిక వేధింపులు ఎప్పటికప్పుడు పెరిగిపోతూనే ఉన్నాయి. ఇంటా బయటా, పనిప్రదేశాలు, పాఠశాలల్లో చోటుచేసుకుంటున్న దారుణాలను ఎదుర్కోవడంలో స్వీయ రక్షణ చర్యలు అత్యంత కీలకం.

అదే సమయంలో చట్టపరంగా,గ్రామస్థాయి నుంచే ఎన్నో రక్షణ వలయాలు ఉన్నాయి.వాటిపై అవగాహన లేకపోవడమే ఇప్పుడు మహిళలకు శాపంగా మారింది.

సమస్య మృగాళ్లకు ఆసరా...

ఇంట్లో ఏదైనా సమస్య వస్తే చాలామంది ఇత రులతో పంచుకుంటారు. ఓదార్పు కోరుకుంటారు. ఈ తీరు మహిళలలో కాస్త ఎక్కువ. ఇలాంటి పరిస్థితి ఎదురైతే బాగా తెలిసిన వారితో చెప్పుకోవడం ఉత్తమం.ఇతర ప్రదేశాలలో మనకు తెలియని వారి దగ్గర చెప్పుకుంటే... కొందరు దాన్ని ఆసరాగా తీసుకొనే అవకాశం ఉంది. అదే జరిగితే తర్వాత వారితో మనం సమస్య ఎదుర్కొంటాం. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు నగరంతో పాటు, ఇతర పట్టణాల్లో పోలీసు స్టేషన్ల వరకు వచ్చిన వేధింపుల కేసులలో పరిచయం లేని వారి నుంచి వచ్చినవే 80 శాతం వరకు ఉన్నాయి.

ఓదార్పు మాటున....

ఉమ్మడి కుటుంబాలు కరువై ఒంటరితనంతో కొందరు వేదన అనుభవిస్తున్నారు.తమతో కాసేపు సమయం గడిపే వారు లేక తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక కాస్త ప్రేమగా మాట్లాడు తున్న వారి వలలో పడుతున్నారు. తర్వాత వారి అసలు స్వరూపం తెలిసి మదన పడుతున్నారు. కొందరు అమాయక యువతులు, విలాసవంత మైన జీవితాన్ని కాంక్షిస్తూ దుర్మార్గుల ఉచ్చులో చిక్కుకుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

అపరిచితులతో జాగ్రత్త....

సాయం చేస్తామంటూ దగ్గర అయ్యే అపరిచితుల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కెరీర్, ఉద్యోగం అంటూ మాయ మాటలు చెప్పే వారితో బహు పరాక్. వీలైతే ముక్కు ముఖం తెలియని వారి ఆయాచిత సాయం తిరస్కరించడమే మేలు. కొందరు దుర్మార్గులు సామాజిక మాధ్యమాలతో ఇతరుల జీవితాలలోకి చొచ్చుకొస్తున్నారు.తీయగా మాటలు కలిపి జతకడుతున్నారు.అదును చూసి బుస కొడుతున్నారు. మన చుట్టూనే ఉన్న మేక వన్నె పులులు ఏ రూపాల్లో వల వేస్తారో తెలియని దుస్థితి నేటి సమాజంలో నెలకొంది. స్నేహితుల్లో మంచివారు అని భావించినప్పటికీ అప్రమత్తంగా ఉండాలి. తల్లిదండ్రులు కూడా బాధ్యతగా ఉండా లి.పిల్లల చదువులు, ఉద్యోగాలు, స్నేహితులు, వారు తిరిగే సమాజం ఇలా అన్నింటిపై ఓ కన్నేసి ఉంచాలి.

పాఠశాలలలో ఇలా పదిలం...

పాఠశాల స్థాయిలోనే విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. సహవిద్యార్థులు, కొందరు ఉపాధ్యాయులు కూడా బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు.ఇటీవల తరచూ ఎక్కువగా పెరిగాయి.వీటి బారిన ▶మిగతా 2లో

ఫిర్యాదులపై సకాలంలో స్పందించండి

కమిషనర్ భావన

విశాలాంధ్ర - కాకినాడ : మీకోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే ఫిర్యాదులను నిశితంగా పరిశీలించడంతో పాటు వాటి పరిష్కారానికి సకాలంలో స్పందించాలని కమిషనర్ భావన ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. ప్రజా పరిష్కార ఫిర్యాదులపై గురువారం కమిషనర్ నగరపాలక సంస్థ సెక్షన్ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే వినతులను స్వీయ పరిశీలన అనంతరం మాత్రమే క్లోజ్ చేయాలని అధికారులను సూచించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణముగా ప్రజా సమస్యలపై క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అర్జీలపై వెంటనే స్పందించాలని, తప్పనిసరిగా గడువులోపల స్పష్టమైన వివరణ అర్జీదారునకు అందించి, వీలైనంతగా సంతృప్తి స్థాయిని పెంపొందించాలని తెలిపారు. ప్రజా ఫిర్యాదులను కమ్యూనిటీ, ఫైనాన్స్, నాన్ ఫైనాన్స్ ఫిర్యాదులుగా వర్గీకరించి నిర్ణీత గడువులోపు సత్వర పరిష్కారం చూపాలని కోరారు. సమావేశంలో నగరపాలక సంస్థ విభాగాధిపతులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

2లో

క్విట్ ఇండియా స్మృతి వనం భావితరాలకు స్ఫూర్తి...

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: క్విట్ ఇండియా స్మృతి వనం భావితరాలకు స్ఫూర్తి అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు.క్విట్ ఇండియా స్థూప నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్మృతివనం, వసుధ ఫౌండేషన్ సహకారంతో ఫెన్సింగ్, గార్డెనింగ్ అభివృద్ధి, నిర్మాణ పనులకు గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శంకుస్థాపన చేసారు.తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలదండ వేసి అమరవీరులకు నివాళిలర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ క్విట్ ఇండియా అమరవీరుల స్మృతి వనం స్థూపం భావితరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. భీమవరంలో స్వాతంత్రోద్యమంలో గాంధీజీ పిలుపుమేరకు అన్ని ఉద్యమాలు మహోధ్యమాలుగా సాగాయని అన్నారు.క్విట్ ఇండియా ఉద్యమంలో ఆనాడు నలుగురు యువ సమరయోధులు అశువులు బాయటం జాతి చరిత్రలో చరిత్రగా మిగిలిందని, పన్నుల నిరాకరణ క్విట్ ఇండియా ఉద్యమాలకు రెండొవ బార్డోలీగా గాంధీజీ పిలుపునిచ్చారని అన్నారు. క్విట్ ఇండియా అమరవీరుల జ్ఞాపకార్థం పునః నిర్మాణ కమిటీ ▶మిగతా 2లో

ఇసుక రవాణా చేసే

వాహనాల పేర్లు నమోదు చేయాలి

ఉచిత ఇసుక పాలసీ విధానం అమలు తీరుపై

కలెక్టర్,ఎస్పీ సమీక్ష

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ఇసుక రవాణా చేసే వాహనాలు రవాణా శాఖ వద్ద పేర్లు నమోదు చేయాల్సి ఉందని, వినియోగదారుని ఫోన్ నెంబర్, చిరునామా తప్ప నిసరిగా ట్రిక్ షీట్‌లో పొందు పరచాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం కలెక్టర్ సమావేశ మంది రంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులతో ఎస్పీ డి . నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడులతో కలిసి సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ, ఉచిత ఇసుక పాలసీ విధానం లో వినియోగ దారులకు అందుబాటులో ఇసుక అందజేసేందుకు పకడ్బందీగా నిర్వ హించేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలెక్టర్ ఎస్పీలతో నిర్వహించిన వీడి యో కాన్ఫరెన్స్ లో దిశా నిర్దేశనం చెయ్యడం జరిగిందన్నారు. ము ఖ్యంగా నాలుగు అంశాలను పేర్కొ న్నారని,ట్రాన్స్‌పోర్టర్లు అధిక చార్జీలు వసూళ్లు, మధ్యవర్తుల ప్రమేయం, రీచ్ ల వద్ద వాహనాల అనవసర నిరీ క్షణల నివారణ, డిమాండ్‌కు అను గుణంగా ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేసే విధానం లో భాగంగా ఇసుక రవాణా చేసే వాహ నాలు వివరాలు కచ్చితంగా ఆర్టీవో వద్ద రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. రీచ్ వారీగా ఆయా వాహనాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఆమేరకు రీచ్‌లకి బుకింగ్ కోసం వాహనాలను అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇసుక కోసం పేర్లు నమోదు చేసేందుకు ప్రతీ రీచ్ పా యింట్ కు చెందిన సమీపంలో నిర్ణీత ప్రదేశంలో ప్రత్యేక రిజిస్ట్రేషన్ పా యింట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వాటినీ బ్లాక్ లిస్టులో పెట్టడం ద్వారా వాటినీ ద్వారా ఎటువంటి సరుకు రవాణా చేసే అవకాశం లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుం న్నారు. ఉదయం 6 నుంచి సా యంత్రం 6 వరకూ ఇసుక రీచ్ వద్ద వాహనాలను రవాణా కు అనుమ తించడం జరుగుతున్న దృష్ట్యా రీచ్ లోకి వాహనం వొచ్చి, ఇసుక లోడింగ్ చేసుకుని, తిరిగి బయటకి వొచ్చే ▶మిగతా 2లో

మగువా...!నీ చేతుల్లోనే రక్షణ..

మొదటి పేజీ తరువాయి

పడ కుండా, వేధింపులను నివారించడంలో విద్యా కమిటీలు కీలక భూమి పోషించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలి. విద్యార్థుల్లో నేర ప్రవృత్తి పెరుగుతున్నా... గంజాయి, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నా... వారిని గుర్తించి సక్రమ మార్గంలో పెట్టేందుకు ప్రయత్నాలు చేయాలి. పాఠశాలలలో ఎవరైనా వేధిస్తే చైల్డ్ లైన్ 1098 కు ఫోన్ చేసి రక్షణ పొంది అవకాశం ఉంది.

పని ప్రదేశాలలో మరింత భద్రం...

యువతులు, మహిళలపై లైంగిక వేధింపులు తక్కువ ఏమీ కాదు.పని ప్రదేశాలలో మహిళలు నిత్యం వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఇటువంటి సందర్భంలో పోలీసు రక్షణ కోసం డయల్ 100 కు ఫోన్ చేసి తక్షణ సాయం పొందే అవకాశం ఉంది. మహిళల కోసమే ప్రత్యేకంగా ఉమెన్ హెల్ప్ లైన్-112 పనిచేస్తుంది.

పంచాయతీల పాత్ర కీలకం...

మహిళలు, విద్యార్థినులపై లైంగిక వేధింపులు, అత్యాచారాలను అరికట్టడంలో గ్రామ పంచాయతీల పాత్ర కూడా అత్యంత కీలకం. ఇటువంటి ఘటనలపై ఎవరికి ఫిర్యాదు చేయాలి...?, ఎటువంటి ఏజెన్సీల ద్వారా సహాయం పొందాలనే విషయంపై ప్రతి గ్రామపంచాయతీలో సమగ్ర సమాచారంతో బోర్డులు ఏర్పాటు చేయాలి. గ్రామస్థాయిలోనే పంచాయతీ కార్యదర్శి,గ్రామ సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీస్), పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అత్యాచార, లైంగిక వేధింపుల బాధితులకు మనోధైర్యం కల్పించడంతోపాటు,వైద్య సహాయం, న్యాయ సహాయం అందించాల్సిన బాధ్యత కూడా పంచాయతీలపై ఉంది. దురదృష్టవశాత్తూ క్షేత్రస్థాయిలో ఇవి పటిష్టంగా అమలు కావడం లేదు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, మానసిక నిపుణులు చిత్తశుద్ధితో కృషి చేస్తే అత్యాచారాలను,హత్యలను, వేధింపులను అరికట్టే అవకాశం ఉంది. ప్రజలు, ప్రభుత్వాల భాగస్వామ్యంతో అడ్డుకట్ట వేయాలి.లేదంటే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఎలాంటి చట్టాలు చేస్తాయో వేచి చూద్దాం.

వాహనాల పేర్లు నమోదు చేయాలి

సమయాన్ని అనుసరించి రీచ్ వారీగా వాహనాలకు స్లాట్ లని కేటాయించాలని ఆదేశించారు. వినియోగదారుని వివరాలు ఆధారంగా క్రాస్ చెక్ చేసే వ్యవస్థను ప్రవేశ పెట్టడం పెట్టి, గ్రామ స్థాయి లో 20 శాతం మేర క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి నివేదిక అందచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు, బయో మెట్రిక్ గుర్తింపు వ్యవస్థ ఏర్పాటు చెయ్యాలని కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్పీ డీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ మధ్యవర్తుల ప్రమేయం నివారించే క్రమంలో రీచ్ లలోకి కేవలం అనుమతి పొందిన వాహనాలని అనుమతిస్తామని స్పష్టం చేశారు. రీచ్ ల వద్ద ఎటువంటి క్యూ లైన్లు లేకుండా నిర్వహణా వ్యవస్థ ఉండాలన్నారు. ప్రత్యేక రిజిస్ట్రేషన్ పాయింట్ వద్ద నమోదు చేసిన వాటికి ట్రక్ షీట్ అనుసరించి మాత్రమే తనిఖీ చేసి రీచ్ లోకి అనుమతి ఇస్తామన్నారు. ఈ సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, జిల్లా రెవిన్యూ అధికారులు జి. నరసింహులు, ఆర్డీవో లు కే ఎల్ శివ జ్యోతి, ఆర్ కృష్ణ నాయక్, ఎస్ ఈ ఇరిగేషన్ ఎస్. శ్రీనివాస రావు, మైన్స్ ఏ డీ ఎమ్. సుబ్రహ్మణ్యం , డి టి సి టివి కృష్ణా రావు, ఈ ఈ ఇరిగేషన్ ఆర్. కాశీ విశ్వేశ్వర రావు, డిడి గ్రౌండ్ వాటర్ వై. శ్రీనివాస్, డీఎస్పీలు, సెబి, రవాణా, అధికారులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్మృతి వనం భావితరాలకు స్ఫూర్తి...

ఏర్పాటు చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలను చేయడం అభినందనీయమని కమిటీ సభ్యులను అభినందించారు.కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, బోండా సుబ్బారావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఇందుకూరి ప్రసాద రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సహకరించటంతో, ఈ స్థలంలో వసుధ ఫౌండేషన్, దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు కి కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ నాగరాణి కి గాంధీజీ జ్ఞాపికను బహూకరించి సత్కరించారు.మానవత స్వచ్ఛంద సంస్థ 20వ ఆవిర్భావ దినోత్సవం సందర్భముగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుండి ప్రకాశం చౌక్ వరకు సాగిన మానవత స్వచ్ఛంద సంస్థ శాంతి ర్యాలీని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్విట్ ఇండియా స్థూపం పునర్నిర్మాణ కమిటీ సభ్యులు చెరుకువాడ వెంకటరామయ్య, కందుకూరి ప్రసాదరాజు, బోండా వెంకట సుబ్బారావు, కంతేటి వెంకటరాజు, అరసపల్లి సుబ్రహ్మణ్యం ,చెరుకువాడ రంగసాయి, పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు, బి వి రాజు కాలేజీ, సిగ్గి హై స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: మైనార్టీల సంక్షేమానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.గురువారం కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలోని మీద మైనార్టీ సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలపై చర్చించారు. ఈ సమావేశమునకు మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లిమ్, క్రిస్టియన్, జైన్ వర్గాలకు చెందిన సంఘాల అధ్యక్షులు, పెద్దలు, నాయకులు, పాస్టర్లు హాజర య్యారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు వారి సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మతపరమైన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు స్థలాలు, కమ్యూనిటీ హాళ్ల ప్రభుత్వం స్థలాలు కేటాయించి నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. ప్రస్తుత స్మశాన వాటికలు పూర్తిగా నిండుకున్నాయని, వేరొక ప్రదేశంలో స్మశాన వాటిక ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలన్నారు. వారి పిల్లలకు ఉన్నత చదువులు కొరకు ప్రభుత్వ సహాయ సహకారాలు అందించాలన్నారు.ప్రభుత్వం నుండి అందే సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. అలాగే గత ప్రభుత్వం రద్దు చేసిన మైనార్టీ పథకాలను పునరుద్ధరించి మళ్లీ అమలు చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మైనార్టీ వర్గాలకు ప్రభుత్వం తరపున అందే సంక్షేమ పథకాలు, వారికి వచ్చే రాయితీలు అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటూ ఉన్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి భవిష్యత్తులో ఏర్పడేలా తీర్చిదిద్దాలని సూచించారు. పదవ తరగతి నుండి డిగ్రీ వరకు చదువుకున్న పిల్లలకు అనేక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నేను హామీ ఇస్తున్నానని సభ ముఖంగా తెలుపుతూ, సద్వినియోగం చేసుకోవాలన్నారు. నా దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.ఎస్. కృపావరం, ముస్లిం కమ్యూనిటీ అధ్యక్షులు మహమ్మద్ జానీ, క్రిస్టియన్ కమ్యూనిటీ అధ్యక్షులు వరప్రసాదు, జైన్ కమ్యూనిటీ అధ్యక్షులు అస్మిత్ జైన్, మైనార్టీ సంఘాల నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చేతబడి నెపంతో మహిళ దంతాలు పీకివేసిన బంధువులు

విశాలాంధ్ర - ద్వారకాతిరుమల : మంత్రాలకు చింతకాయలు రాలుతాయా అంటారు. అయినా సరే ఇప్పటికీ గ్రామాల్లో మూఢనమ్మకాలు పోవడం లేదు. చేతబడులు చేస్తున్నారని దాడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఎం. నాగులపల్లి పంచాయితీలోని మత్తేవారి గూడెంలో చేతబడి చేస్తుందన్న నెపంతో ఒక మహిళపై దాడిచేసి కటింగ్‌ప్లేయర్‌తో దంతాలు పీకివేసిన ఘటన జరిగింది. భీమడోలు సిఐ బి.రవికుమార్, ద్వారకా తిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని మత్తేవారిగూడెంలో గురువారం మధ్యాహ్నం గుండెకంటి మద్దిరావమ్మ(62) అనే మహిళను గ్రామంలో పెద్దల సమక్షంలోకి పిలిచారు. అదే గ్రామానికి చెందిన బాధితురాలి బంధువైన గుండెకంటి రాజశేఖర్ కుమారు నికి గత కొంత కాలంగా ఆరోగ్యం క్షీణించిందని దానికి కారణం మద్దిరావమ్మ చేతబడి చేసిందని అభియోగం చేశారు. దీంతో కోపోద్రిక్తులైన మద్దికంటి రాజశేఖర్, మద్దికంటి నాగరాజు, మద్దికంటి వరప్రసాద్ అనే ముగ్గురు వ్యక్తులు కలసి గ్రామంలో ఎవరికి చేతబడులు చేయకుండా ఉండాలని మద్దిరావమ్మపై దాడిచేసి కటింగ్ ప్లేయర్‌తో నోటిలోని దంతాలను పీకివేశారు. సంఘటన తెలుసుకున్న ఎస్సై సుధీర్ సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర రక్తస్రావం అవుతున్న మద్దిరావమ్మను పోలీస్ వ్యాన్‌ద్వారా ఆసుపత్రికి తరలించారు. అనంతరం గ్రామంలో ధర్యాప్తుచేసి సంఘటనకు కారకులైన పైముగ్గురు వ్యక్తులపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

ఎంపీ మహేష్‌కు అభినందనలు

విశాలాంధ్ర - నిడమర్రు: ఏలూరు లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు కృషిచేసిన ఏలూరు పార్లమెంటు సభ్యులు పొట్టా మహేష్ కుమార్ యాదవ్ కు అదే విధంగా రైల్వే బోర్డు జాయింట్ డైరెక్టర్ వివేక్ కుమార్ సిన్హాకు గురువారం నిడమర్రు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నిడమర్రు మండల టీడీపీ అధ్యక్షు లు ముత్యాల వెంకటేశ్వరరావు (స్వామి) తెలుగుదేశం పార్టీ ఏలూ రు జిల్లా తెలుగు యువత కార్యదర్శి మహమ్మద్ గఫర్ ఖాన్, ఏలూరు జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సంబంగి రంగారావు, టిడిపి నిడమర్రు మండల తెలుగు రైతు అధ్యక్షులు సత్తినీటి వెంకటేశ్వరరావు (నాని) టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పాలకొల్లు : మెగాస్టార్ చిరంజీవి 69వ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వర రావు ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు పాలకొల్లులో గురువారం ఘనంగా జరిగాయి. బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఉన్న ఆపద్బంధు బ్లడ్ బ్యాంక్ నందు చిరు బర్త్ డే కేక్ కట్ చేసి రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిడగం సురేంద్ర,ఆచంట చరణ్ దీపు, బిట్టా లక్ష్మీనారాయణ,ఆదిమూలం అను,చేబ్రోలు కృష్ణమోహన్,కోటిపల్లి మణికంఠ,బొద్దాని శిరీష్,పోకల శివ, పినిశెట్టి అంజి. కాసెట్టి సురేంద్ర .నూకల శీను. ప్రేమ్ కుమార్,. పినిశెట్టి శ్రీనివాస్ పి.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ మృతదేహంతో ఆందోళన

విశాలాంధ్ర-లింగపాలెం: మఠంగూడెంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న గొల్లపల్లి బాలస్వామిని భార్య, మరికొందరు కలిసి కొట్టి చంపారంటూ మృతిని బంధువులు ఆందోళన చేపట్టారు. వీరు మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బైఠాయించే ఆందోళన చేయడంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. ఈసంఘటనపై ఎస్ఐ చెన్నారావు మాట్లాడుతూ మృతిని మృతిపై దర్యాప్తు చేపట్టామని వాస్తవాలను వెలికి తీసి తగు న్యాయం చేస్తామని తెలిపారు. ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులతో పోలీసులు మాట్లాడారు.ఇప్పటికే మృతుని భార్యను అదుపులోకి తీసుకొని వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చిన్నారులను ప్రేమతో ఆదరించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర - భీమవరం : ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను జాలితో చూడకుండా ప్రేమతో ఆదరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.గురువారం భీమవరం పట్టణంలోని శివరావుపేట గాలి రామయ్య మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లల కొరకు ఏర్పాటు చేసిన భవిత సెంటర్ (దివ్యాంగులు)ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించి, దివ్యంగులకు అందిస్తున్న బోధనా విధానాలను స్వయంగా పరిశీలించి, అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన బాల బాలికలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు,సిబ్బంది నిరంతర కృషి, శ్రమ ఎంతో అవసరమన్నారు.వీరిపట్ల ప్రేమాభిమానాలతో మసులుకుంటూ విద్యాబోధన చేయడం ఎంతో అవసరం అన్నారు.వీరిని ప్రయోజకులను చేయటం అనేది ఎంతో ముఖ్యమని, దీనిలో ఉపాధ్యాయులు,సహాయకులు

పాత్ర ఎంతో ప్రశంసనీయమన్నారు. వస్తువులను, బొమ్మలను చూపించి గుర్తించడం, వాటి పేర్లను చెప్పించడం ద్వారా జరుగుతున్న విద్యాబోధనను పరిశీలించి, విద్యార్థులను పలు ప్రశ్నలు కలెక్టర్ అడిగి సమాధానాలను చెప్పించడం జరిగింది. ఫిజియోథెరపీ ఉపకరణాలు, ఆట వస్తువులు, వీల్ చైర్స్, తదితర సామగ్రి ఉంచిన గదిని పరిశీలించి, వాటిని వినియోగిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.ఏ విషయాన్ని స్పష్టంగా చెప్పలేని ఇటువంటి పిల్లలకు ఉపాధ్యాయులు,ఆయాలు తల్లిదండ్రులు స్థానంలో ఉంటూ మంచి విద్యను, ప్రతి విషయంపై పూర్తి అవగాహన కల్పించవలసిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. వారికి అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి, వారు ఆహారం తీసుకోవడంలో ఆయాలు శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో 19 భవిత కేంద్రాలు ఉన్నాయని, వాటిలో ప్రత్యేక అవసరాల విద్యా బోధనకు 38 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, ఏడు మంది ఫిజియోథెరపిస్టులు ఉన్నట్లు తెలిపారు.

అవసరమైన పిల్లలకు వీల్ చైర్స్, కళ్ళజోళ్ళు, చెవిటి మిషన్లు తదితర ఉపకరణాలను ఉచితంగా ఇవ్వడంతో పాటు,భవిత సెంటర్ కు పిల్లలను తీసుకొచ్చేవారికి రవాణా చార్జీలు నిమిత్తం 3 వేల రూపాయలు విద్యార్థుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.

ఈ పర్యటనలో జిల్లా విద్యా శాఖ అధికారి జి.నాగమణి, ఎస్ ఎస్ ఏ పి.ఓ శ్యాంసుందర్, మధ్యాహ్న భోజనం-పాఠశాలల పారిశుధ్యం కోఆర్డినేటర్ కె.కృష్ణారావు, ఎంఈఓలు ఎన్.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, హెడ్ మాస్టర్ దుర్గ భవాని, ఐఈ కోఆర్డినేటర్ సిహెచ్ సుబ్రహ్మణ్యం, తదితరులు ఉన్నారు.

వేంద్రలో పొలంబడి

విశాలాంధ్ర - పాలకోడేరు: పాలకోడేరు మండలం వేంద్ర గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వి. నారాయణ రావు ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పావని,మధు బాబు, సత్యనారాయణ,రైతులు పాల్గొన్నారు.

బాలుడికి వైద్యానికి ఫౌండేషన్ ట్రస్టు సాయం

విశాలాంధ్ర-కామవరపుకోట: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడు వైద్య ఖర్చుల నిమిత్తం సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా సేకరించిన రూ. 13వేల700లను గురువారం బాలుడు కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ట్రస్ట్ చైర్మన్ వీరమళ్ళ మధుసూదనరావు తెలిపారు. కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామానికి చెందిన గూట్ల ఆనందరావు 10నెలల కుమారుడు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తమ దృష్టికి తీసుకురావడంతో దాతల ద్వారా విరాళాలను సేకరించి తమ వంతు సహకారం చేసినట్లు మధుసూదనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారులు టీవీఎస్ రాజుపాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ అభివృద్ధికి పాటుపడాలని మాజీ జెడ్పిటిసి సభ్యులు ఉభయ పశ్చిమగోదావరి జిల్లా జనసేన కార్యదర్శి గడ్డ మణు గు రవికుమార్ అన్నారు. గురువారం తాటి ఆకులగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, సర్పంచ్ పరమా రాంబాబు ,కార్యదర్శి సిహెచ్ వీరలక్ష్మి, ఉపాధి టి ఏ బి దుర్గారావు, బి ఎఫ్ టి వెంకన్న బాబు, కాసిన రాజు తదితరులు పాల్గొన్నారు .

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-లింగపాలెం: ఉరేసుకొని మఠం గూడెంలో గొల్లపల్లి బాలస్వామి(35) ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు చెప్పిన వివరాలు ప్రకారం భార్య,భర్తల మధ్య నెలకొన్న విభేదాలతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసామని ఎస్సై తెలిపారు.

ఫెర్టిలైజర్ దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర-లింగపాలెం:లింగపాలెం, చింతలపూడి మండలాల్లో తూనికల కొలతల అసిస్టెంట్ కంట్రోలర్ సాయిరాం ఆధ్వర్యంలో పలు దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ధర్మాజీగూడెంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణం,లింగపాలెం లోని విజయదుర్గ వెలగలపల్లి సత్య ట్రేడర్స్ లో తనిఖీలు నిర్వహించారు. వాటిలోఎరువులకు సంబంధించి వివరాలు సక్రమంగా లేనందున కంపెనీలపై కేసులు నమోదు చేసినట్లు అసిస్టెంట్ కంట్రోలర్ తెలిపారు. ధర్మాజీగూడెంలోని సివిల్ సప్లైపాయింట్ ను తనిఖీ చేశారు. ఇక్కడ అన్ని సక్రమంగానే ఉన్నట్లు వీరు వెల్లడించారు. తనిఖీలలోఇన్స్పెక్టర్ ప్రశాంత్ కుమార్ సిబ్బంది చంద్రశేఖర్, గణేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటాలి..

ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

విశాలాంధ్ర-నరసాపురం: పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పిలుపునిచ్చారు. నరసాపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఎంపీడీవో కోటిపల్లి వెంకటేశ్వరరావు, నాని మైలబత్తులు సోనీ గంటా కృష్ణ పోలిశెట్టి సాంబ పొన్నమండ యుగంధర్ కొవిదెల శ్రీను, జనసేన టీడీపీ బీజేపీ నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -భీమవరం: ఎంతో మందికి స్ఫూర్తి మెగాస్టార్ చిరంజీవి అని, కష్టాల్లో ఉన్నవారికి సాయం చేసే ఆపద్బాంధవుడు చిరంజీవి అని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం పట్టణ చిరంజీవి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో అంకాల ఆర్ట్స్ అకాడమీలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి కృష్ణ అభిమాని బంగారు సుబ్బారావుకి చిరంజీవి అభిమానుల సహకారంతో రూ 20 వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సినీ నేపథ్యం లేకుండా సాధారణ మధ్య తరగతి ఫ్యామిలీ నుంచి తెలుగు చలన చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి తెలుగు సినిమా గతి మార్చిన హీరో, దశాబ్దాలుగా చిత్రసీమను ఏలుతున్న రారాజు చిరంజీవి అని అన్నారు. రాష్ట్ర చిరంజీవి యు

వత ఉపాధ్యక్షులు ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ చిరు సినీ ప్రయాణంలో ఎన్నో సంచలనాలు మరెన్నో రికార్డులున్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, కొప్పినిడి బాబీ, పోకల కిషోర్, యడ్లపల్లి రాంబాబు, నాగిడి శ్యామ్, కొమ్మన శ్రీను, తోట శేషు, రాపూరి ప్రసాద్, మాదాసు సాయి, మాదసు బాబీ, కార్తీక్, గుద్దటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : పట్టణంలోని తేతలి సత్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్ ను గురువారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణాన్ని రూ.6 లక్షలతో పాటు దాతల సహకారంతో అభివృద్ధి చేస్తాం అని తెలిపారు. స్కూల్ పూర్వ విద్యార్థిగా ఎమ్మెల్యే బొలిశెట్టి రూ. 50వేల విరాళం ప్రకటించారు. ప్రభుత్వంతో పాటు దాతల సహకారం స్కూలు అభివృద్ధికి అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మండల విద్యాశాఖ

అధికారి హనుమ, పాలూరు వెంకటేశ్వర రావు,పైబోయిన వెంకటరామయ్య సజ్జ సుబ్బు, చాపల రమేష్,జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు మైనం సత్యనారాయణ,అడ్వకేట్ ఎన్. వి.వి. సత్యనారాయణ ,కాళ్ల గోపికృష్ణ, సిఆర్పి భత్తుల నాని, స్కూలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

విశాలాంధ్ర-లింగపాలెం: టి.సి.హెచ్.ఆర్ పాలెంలో తమ్మిలేరు కాల్వ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల పై ఎస్పీ ప్రశాంత్ శివ కిషోర్ గురువారం తెల్లవారుజామున ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో మూడు ట్రాక్టర్లు పట్టు పడగా వీటిని సీజ్ చేసి ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్లో ఉంచారు. ఇసుకను తరలిస్తున్న కఠారి సర్వేశ్వరరావు, ఉలిమి వెంకటేశ్వరరావు, పోలిబోయిన నాగేశ్వరరావు లపై కేసు నమోదు చేశారు. ఎస్పీ స్వయంగా వచ్చి ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడం చంచలనం అయ్యింది.అక్రమ వ్యాపారుల ఆగడాలు నివారించబడతాయని ప్రజలు భావిస్తున్నారు.

గ్రామ సభలు విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే వత్సమట్ల ధర్మరాజు

విశాలాంధ్ర - భీమడోలు : గ్రామీణాభివృద్ధిశాఖామంత్రి పవన్ కళ్యాణ్, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈనెల 23వతేది శుక్రవారం ప్రభుత్వం నిర్వహించనున్న గ్రామసభలలో స్థానికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. గురువారం భీమడోలు మండల పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించే గ్రామసభలో పెద్దఎత్తున మహిళలు, యువత పాల్గొన్నారు.

భీమడోలులో చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - భీమడోలు : పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి స్వయంకృషితో ఎదిగి ఎంతో మందికి రోల్ మోడల్గా నిలిచారని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు భీమడోలు చిరంజీవి ఫ్యాన్స్, టీం రాంచరణ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.. స్థానిక సంతమార్కెట్ సెంటర్ రంగా విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మరాజు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు ప్రత్తి మదన్, తాతిమళ్ల రామ్మూర్తి, నీలం అజయ్, దుర్గ, టీడీపీ నాయకులు కరణం పెద్దిరాజు, పుల్లయ్యనాయుడు, జనసేన టీడీపీ, బీజేపీ శ్రేణులు, మెగా అభిమానులు పాల్గొన్నారు.

బ్రెయిన్ క్యాన్సర్‌తో యువకుడి మృతి

విశాలాంధ్ర- లింగపాలెం: బ్రెయిన్ క్యాన్సర్ తో లింగపాలెం లోని బుల్లా శశికాంత్ (20) గురువారం మృతి చెందాడు. ఈయువకుని మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది.మృతుని అమ్మానాన్నలుజయ రాజు, బుజ్జమ్మల ఆవేదనకు అంతులేకుండా ఉంది. పదిరోజులు క్రితం తలనొప్పి జ్వరంతో బాధపడుతుండగా పలు ఆసుపత్రులకు వైద్యం కోసం తీసుకువెళ్లారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఈయువకుని వైద్యం కోసం గ్రామస్తులు విరాళాలు సేకరించి వైద్య ఖర్చులకు డబ్బును అందించారు.ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్న శశికాంత్ మృతి స్నేహితులలో తీవ్ర విషాదాన్ని నింపింది. అందరితో కలివిడిగా మంచిగా ఉండే శశికాంత్ ఇక లేడనే వాస్తవాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.యువకుని మృతికి గ్రామస్తులు నివాళులు అర్పించారు.

అల్లూరు అంగన్‌వాడీ కేంద్రానికి ర్యాక్ వితరణ

విశాలాంధ్ర-ముదినేపల్లి: మండలంలోని అల్లూరు గ్రామపంచాయతీలోని అంగన్‌వాడీ-2 కేంద్రానికి ఐరన్ ర్యాక్ వితరణ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారుల ప్రీ స్కూల్ కిట్స్ , పిల్లల పుస్తకాలు పెట్టుకునేందుకు రూ 1500 విలువ చేసే ర్యాక్ ను దాసరి శ్రీనివాసరావు వితరణ చేయడం పట్ల సూపర్వైజర్ సిహెచ్ ప్రసన్న , అంగన్వాడీ టీచర్ సిహెచ్ భాగ్యలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

స్వయంకృషితో ఎదిగిన మెగాస్టార్ చిరంజీవి

ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: తన స్వయంకృషితో ఎదిగి ఎందరికో మార్గదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి అని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు కొనియాడారు. గురువారం నిడమర్రు మండలం భువనపల్లి గ్రామంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చిరంజీవి ప్రతిభ కృషితో సినీ రంగంలో కాకుండా ఆయన చేసిన సేవా కార్యక్రమాలు కూడా తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తోట శీను, ముత్యాల స్వామి, సంకు శ్రీను, అయ్యప్ప, జనసేన టిడిపి బిజెపి నాయకులు కార్యకర్తలు మెగాస్టార్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం డిఎస్పీగా వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - పోలవరం : పోలవరం నూతన డిఎస్పీగా ఎం వెంకటేశ్వరావు గురువారం డిఎస్పీ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ముందుగా కార్యాలయానికి వచ్చిన డీ.ఎస్.పి.కి పోలవరం సిఐ మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్ లు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఏలూరు జిల్లాలో ఇంటిలిజెన్స్ డి.ఎస్.పి. గా పని చేశానని చెప్పారు. పోలవరం మండల ప్రజలకు అందుబాటులో ఉండి తమ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు.

ఆక్వా రైతులు త్వరగా అనుమతులు తీసుకోవాలి

- మత్స్యశాఖ ఏడి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - గణపవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా డెవలప్మెంట్ అథార్టీ అనుమతులు తప్పనిసరిగా ఆక్వా రైతులు పొందాలని లేనివారు వెంటనే అనుమతులు తీసుకోవాలని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో మత్స్యశాఖ ఎపెండా సంయుక్త ఆధ్వర్యంలో ఎన్రోల్మెంట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గణపవరం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి శివరామకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎపెండా అధికారి గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా నుంచి ఎగుమతులు అయ్యే ఆక్వా ఉత్పత్తుల కోసం వారు వద్ద నమో చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్టిఓ ఏడుకొండలు మత్స్యశాఖ సహాయకులు షర్మిల, భాస్కర్, నాగేంద్ర, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

విశాలాంధ్ర- నూజివీడుటౌన్: పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధుల నుండి దూరంగా ఉండొచ్చని గొల్లపల్లి పి.హెచ్.సి వైద్య అధికారిణి ఎస్.కె నజ్మా అన్నారు. గురువారం పిహెచ్సి పరిధిలోని మీర్జాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హెచ్ఎస్ గూంద్రు శ్రీనివాసరావు, ధనమ్మ ,రాజేష్, ఏఎన్ఎం కుమారీ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - భీమవరం : 2024 ఖరీఫ్ కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేటు జిల్లా జాయింటు కలెక్టరు ఛాంబరు నందు 2024 ఖరీఫ్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ముందస్తు చర్యలుపై సంబంధిత అధికారులు, రైసు మిల్లర్స్ అధ్యక్షులు, ప్రతినిధులతో జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్ళకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, గత అనుభవాలు దృష్ట్యా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసు కోవాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 264 రైతు సహాయక కేంద్రాలు సిద్ధం చేసుకోవాలని, ఇందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బందితో క్షేత్ర స్థాయిలో పర్యటించి సూపర్ చెక్ చేసు కుని పూర్తి స్థాయిలో నివేదిక అందజేయ్యాలని ఆదేశించారు. 2024 ఖరీఫ్ కు సంబంధించి 5 లక్షల 30 వేలు మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు ప్రాథమిక అంచనా పెట్టుకుని అధికారులు, సిబ్బంది సంసిద్ధులు కావాలన్నారు. 3 వేలు వాహనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను త్వరితగతిన గుర్తించాలన్నారు.వాహనాలకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసి జీపీఎస్ డివైజ్ అమర్చడం తప్పనిసరి అని అధికారులను జాయింటు కలెక్టరు ఆదేశించారు.ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజరు టి.శివరామ ప్రసాద్, డియస్ వో యన్.సరోజ, యఫ్ సిఐ మేనేజరు జి.రంజిత,జిల్లా ట్రాన్సు పోర్టు అధికారి టి.ఉమా మహేశ్వర రావు, డిసివో యం.నాగ రాజు, ఇన్‌ఛార్జి జిల్లా వ్యవ సాయశాఖ అధికారి కె.ఏ.యస్. యస్. శ్రీని వాసరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షులు సా మంతపూడి శ్రీరామరాజు, కార్యదర్శి కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యువత చిరంజీవిని ఆదర్శంగా తీసుకోవాలి

బొల్లాడ నాగరాజు

విశాలాంధ్ర-తణుకు: జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని అనుకునేవారు మెగాస్టార్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకోవాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు బొల్లాడ నాగరాజు అన్నారు. పద్మ విభూషణ్ , మాజీ కేంద్రమంత్రి కొణిదెల శివశంకర వరప్రసాద్ (చిరంజీవి) పుట్టినరోజు సందర్భంగా గురువారం స్థానిక కొండాలమ్మ రోడ్డు ఆర్టీవో ఆఫీసు వద్ద, డంపింగ్ యార్డు వద్ద నివసిస్తున్న అభాగ్యుల మధ్య తణుకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కొక్కిరిమెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో కేకును కట్ చేసి చికెన్ బిర్యాని పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ టి యు సి జిల్లా అధ్యక్షులు గండి రామకృష్ణ, పశ్చిమగోదావరి జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు రాసాబత్తుల అనుకుమార్ (కాంట్రాక్టర్),తణుకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు వడ్డీ రాము,షేక్ షరీఫ్, వెన్న నాగేశ్వరరావు, వంగా రాధాకృష్ణ, సాపిరెడ్డి హరి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి

ఎమ్మెల్యే బడేటి చంటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్ళుగా భావించి ముందుకెళ్తున్న కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తోందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఇందులో భాగంగానే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి కనబరుస్తున్నానన్నారు. ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తనను కలిసేందుకు వచ్చిన ప్రతీ ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే చంటి వారి వద్ద నుండి వినతులు స్వీకరించారు. సమస్యలను సావధానంగా తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పలువురు ఎమ్మెల్యేకి ఆహ్వానాలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చల్లా వెంకట సత్య వరప్రసాదరావు, కొట్టు మనోజ్, బెల్లపుకొండ కిషోర్, వందనాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల సంక్షేమానికి కృషి చేయాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు:సంచార నాలుగు చక్రాల బండ్లపై మిక్చర్,బజ్జీ,పానీపూరి లాంటివి అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్న వీధి విక్రయదారుల సంక్షేమానికి తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ తమ వంతు సహకారం అందించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు కోరారు.సంచార నాలుగు చక్రాల బండ్ల మిక్చర్, పానీపూరి వర్తక సంఘం సభ్యులు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా కోనాల భీమారావు మాట్లాడుతూ వీధి విక్రయదారుల ఉపాధికి భద్రత కల్పించాలని, సబ్సిడీపై రుణాలు ఇప్పించాలని వీధి విక్రయదారుల సంక్షేమానికి కృషి చేయాలని తణుకు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం సంఘ సభ్యులు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా సంఘ గుర్తింపు కార్డులు అందుకున్నారు.తణుకు సంచార నాలుగు చక్రాల బండ్ల మిక్చర్, పానీపూరి వర్తక సంఘం అధ్యక్షుడు కిలాని శ్రీనివాస్, కార్యదర్శి రేలంగి రాజు, ఉపాధ్యక్షుడు రవి పతి, కమిటీ సభ్యులు బూర సింహాచలం,నొడగల శ్రీనివాస్, బూర అప్పలరాజు,నక్కా శ్రీనివాస్,నొడగల పరమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర -భీమవరం: భారతదేశం అహింస త్యాగానికి దేశభక్తికి నిదర్శంగా ప్రపంచ గుర్తింపు ఉందని, అటువంటి శాంతి పదానికి స్ఫూర్తిగా ఉన్న మన దేశంలో మహిళలపై అత్యాచారాలు చేయడం దారుణమని పలువురు అధ్యాపకులు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కేజీఆర్ఎల్ కళాశాలలో కొలకత్తా లో జరిగిన ఘటనపై 200 మంది విద్యార్థులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొలకత్తాలో మహిళ డాక్టర్ పై అత్యాచారం, హత్య రాక్షసకృత్యమని, చట్టాలు ఉన్న తగిన చర్యలు తీసుకోకపోతే ఎవరికి రక్షణ ఉండదని, బాధితులకు న్యాయం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెంటె హరినాథ్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.రామచంద్ర మూర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర రావు, పీజీ డైరెక్టర్ డాక్టర్ తోట రామ్మూర్తి, అధ్యాపకులు నాచు శ్రీవల్లి అనంతరం 200 మంది విద్యార్థుల నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

దివ్యాంగుల వసతి గృహంకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర -భీమవరం: ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికలకు వసతి గృహము ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి. సుజాతా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనము నందు " ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికలకు" వసతి గృహము ఏర్పాటు చేయుటకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో పని చేసిన అనుభవము కలిగిన స్వచ్ఛంద సేవ సంస్థలనుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఆయా స్వచ్ఛంద సేవ సంస్థల రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రము, సంస్థ సభ్యుల వివరములు, సంస్థ మూడు సంవత్సరముల సేవ కార్యక్రమముల వివరములను మూడు సెట్లను ఆగస్టు 28వ తేదీ లోపుగా భీమవరం కలక్టరేట్ లోని జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

ప్రాంగణ ఎంపికలో శ్రీనివాస విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - కాట్రేనికోన : చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో అద్భుత ప్రతిభ కనబరిచారు. కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీ ట్రాక్ త్రిడి, ఏఐ చెందిన నిపుణుల బృందం హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్ బృందం పర్యటించి విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యం పరీక్షించి సాంకేతిక అంశాలపై పరిజ్ఞానాన్ని పరీక్షించి, విశేష ప్రావిణ్యం కనపర్చిన 10 మంది విద్యార్థులకు నియామక పత్రాలను అందచేశారు. సెలెక్ట్ అయిన విద్యారులకు సంవత్సరానికి ఐదు లక్షల ప్యాకేజిని ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల జరిగిన అభినందన సభలో విజేతలుగా నిలిచిన 10 మంది విద్యార్థిని, విద్యార్థులకు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డివిఎస్ఎస్ వర్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు సందీప్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసకుమార్, కళాశాల విద్య శాఖాధిపతి ఎస్ జయ లక్ష్మి, టీపీవో బి అరుణ్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్ క్రీడాకారిణికి సన్మానం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం : విద్యార్థులు తమ విద్యార్థి దశ నుండే, చదువుతో పాటు క్రీడల పట్ల కూడా నైపుణ్యత సాధించాలని తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్ర బాబు. గురువారం తాడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒలింపిక్స్ క్రీడాకారిణి జ్యోతికశ్రీ కి సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జ్యోతికశ్రీ మాట్లాడుతూ తల్లిదండ్రులు, కుటుంబం ప్రోత్సాహంతోనే పాఠశాల స్థాయి నుండి పారిస్ ఒలింపిక్స్‌కు చేరుకున్నానని తెలిపారు. 2024 ఒలింపిక్స్ క్రీడలకు పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన జ్యోతిక శ్రీ భారతదేశం నుండి ఒలింపిక్స్ లో పాల్గొనేందుకు ఎంపికైన 117 మందిలో, తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరిలో ఒకరుగా ఆమె ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఒలింపిక్స్ క్రీడలలో ఆమె క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతిక శ్రీ తండ్రి శ్రీనివాస్, డి ప్రసాద్, అక్కిన గోపాలకృష్ణ, వాకలపూడి సత్యనారాయణ, హెచ్ఎం కె ఐ ఎల్ పూర్ణిమ, వి భాను రేఖ, బి నాగమణి, కె భ్రమరాంబ, సూర్యనారాయణ, అరవింద కుమార్, మీరా సాహెబ్, పట్టాభి రామన్న, రవికాంత్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో ఘనంగా సప్తాహం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో శ్రీకృష్ణుని గుడి వద్ద ఘనంగా ఆరవ సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకుర్తి జగాల్, రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి దంపతులు శ్రీ కృష్ణుడికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలతో పాటు భజన కార్యక్రమాలతో భక్తులు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో రామకుర్తి సత్తిబాబు గురువు, తిరణాల శ్రీను, అంకం బుజ్జి, కోలా గణపతి రామకుర్తి ఎర్ర బుజ్జి, భజన బృందాలు పాల్గొన్నారు.

మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - గండేపల్లి :మండలంలోని యల్లమిల్లి గ్రామంలో గురువారం మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ అధికారిని సిడిపిఓ పూర్ణిమ హాజరయ్యారు. సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ మహిళల రక్షణ, భద్రత, సాధికారత ఈ మిషన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఆర్థికంగా శక్తి మంతులను చేయడం, నైపుణ్యాభివృద్ధి, అక్షరాస్యత, సూక్ష్మ రుణాలు ఇవ్వడం మొదలైన వాటిని ప్రోత్సహించడం ద్వారా మహిళలపై సంరక్షణ భారాన్ని తగ్గించడం మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యాన్ని పెంచవచ్చు. ఆపదలో ఉన్న మహిళలు, గృహహింసకు గురైన బాధిత మహిళలు, లైంగిక వేధింపులు, సామాజిక రుగ్మతలు పై చట్టపరమైన రక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు.

ద్వారంపూడి హయాంలో అక్రమాలకు అడ్డాగా కాకినాడ పోర్ట్

- మరిన్ని చెక్ పోస్టుల ఏర్పాటు
- రాష్ట్రంలో రానున్న కాలంలో ప్రజారంజక పాలన
- రూరల్ ఎమ్మెల్యే పంతం

విశాలాంధ్ర - కాకినాడ : గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు అడ్డాగా కాకినాడ పోర్టును మార్చారని ఇప్పుడు వాటిని అరికట్టేందుకు చెక్ పోస్టు ఏర్పాటు చేస్తే కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఉలికిపడి బహిరంగ లేఖను రాయడం ఏమిటంటూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ పోర్టులో పేదలు తినే బియ్యంతో పాటు గంజాయి ఇతర అక్రమ ఎగుమతులకు కేంద్రంగా మార్చారని ఆయన చెప్పారు. తమ కూటమి ప్రభుత్వ హయాంలో వాటిని అరికట్టేందుకు ఇంకా చెక్ పోస్టు ఏర్పాటు చేసి పోర్టుకి పేరు ప్రఖ్యాతులు తీసుకురానున్నట్లు నానాజీ పేర్కొన్నారు. కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి రెండు రోజుల క్రితం కాకినాడ పోర్టులో అక్రమాలు జరుగుతున్నాయంటూ లేఖ విడుదల చేయడం హాస్యాస్పదమన్నారు. తనకు ఎటువంటి వ్యాపారాలు లేవని చెప్తున్న ద్వారంపూడి తండ్రి పౌరసరఫరాల శాఖ చైర్మన్, తమ్ముడు రాష్ట్ర మిల్లర్స్ సంఘానికి అధ్యక్షుడుగా ఎందుకు కొనసాగారని ప్రశ్నించారు. బియ్యం అక్రమాలు చేసే వారు కాకపోతే ఎందుకు ఆ పదవులను పట్టుకొని వేలాడారని ప్రశ్నించారు. గత నెలలో పోర్టు గొడౌన్లలో దొంగ బియ్యం పట్టుకుంటే అవి మావి కావని ఎందుకు ద్వారంపూడి చెప్పలేకపోతున్నారని ద్వారంపూడిని నానాజీ ప్రశ్నించారు. ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ముద్రగడ పద్మనాభం రెడ్డి, మాదిరిగా లేఖలను విడుదల చేయకుండా నేరుగా ప్రజల్లోకి వచ్చి చెప్పాలని డిమాండ్ చేశారు. కాకినాడ రూరల్ మండలంలో అక్రమ లేఅవుట్లకు గత ప్రభుత్వం అవకాశం కల్పించిందని, తాము వాటిని తొలగింపు చర్యలు చేశామన్నారు. తాము కాకినాడను మహానగరం చేయాలని ఉద్దేశంతో లే అవుట్లను సరి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే కాకినాడ రూరల్ మండలంలో కొన్ని గ్రామాలు కాకినాడ నగర పాలక సంస్థలో విలీనం చేయాలని ప్రజాసంఘాలు తెలియజేస్తున్నాయని, ఈ సమస్య పరిష్కారంపై ఆయా గ్రామాల ప్రజలు గ్రామ సభలు నిర్వహించుకుని తెలియజేయాలని చెప్పామన్నారు. వారు కోరితేనే కాకినాడ నగర పాలక సంస్థలో విలీనం చేస్తామని చెప్పారు. రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్య దర్శి వాసిరెడ్డి ఏసుదాస్ మాట్లాడుతూ కొమరగిరిలో పేదలకు ఇచ్చిన స్థలాలను మెరక చేసే విషయంలో నాలుగు అడుగుల మేర ఎత్తు చేసి మట్టితో కప్పానంటూ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి బిల్లులు చేసుకుని అవినీతికి పాల్పడ్డారన్నారు. ద్వారంపూడి, కన్నబాబులను రోడ్డు పై నడిపించే రోజు త్వరలోనే వస్తుందని దాసు చెప్పారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు రామదేవు సీతయ్య దొర, వెంకటేష్, గోవింద రాజు, తుమ్మలపల్లి వాసు, రమణ పాల్గొన్నారు.

ప్రత్యేక కొబ్బరిబోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కొత్తపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులకు ప్రత్యేక కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొబ్బరి కార్మికుల సంఘం అధ్యక్షులు బొడ్డ పల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీబండారు సత్యానందరావు కొబ్బరి కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కొబ్బరి పై వేలాది మంది జీవనోపాధి పొందుతున్నారని. దింపు, ఒలుపు, నాడెం, మోత, తరుగుడు, పీచు, తాళ్లు, ఎగుమతి, దిగుమతి వీటిపై ఆధారపడి జీవనోపాధి చేస్తున్నారన్నారు. వారి అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక కొబ్బరి బోర్డును ఏర్పాటు చేసి, 50 సంవత్సరాలు దాటినవారికి ఫించన్, ప్రమాద భీమా పథకం సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమస్యపై స్పందించిన ఎమ్ఎల్ఏ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకొని వెళ్లి కొబ్బరి బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - పిఠాపురం : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యత అని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. గురువారం స్థానిక ఆర్ఆర్‌బి హెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ కేశవరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉమర్ ఆలీషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఒక్కొక్క మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం సుందరయ్య, డాక్టర్ కె శారద, డాక్టర్ ఎం రామారావు, ఉదయభాస్కర్, లైబ్రేరి యన్ ఎండి హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డివి కాశీ విశ్వనాథం, వి బుల్లి ప్రసాద్, ట్రస్ట్ సభ్యులు ఏవివి సత్యనారాయణ, రేఖా ప్రకాష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించండి

మంత్రులకు వినతిపత్రం అందించిన ఎమ్మెల్యే బత్తుల

విశాలాంధ్ర - రాజానగరం,సీతానగరం : నియోజక వర్గ అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించాలని నియోజక వర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అన్నారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరివేక్షణ, వివిధ పంట కాలువలు పూడిక తీత తదితర అంశాలపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత, నీటి పారుదల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు లను అమరావతి సచివాలయంలో ఎమ్మెల్యే కలిసి వినతిపత్రాలు అందజేశారు.వైసీపీ ప్రభుత్వంలో ఏపీలో శాంతిభద్ర తలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, మహిళల రక్షణ పట్ల పూర్తి నిర్లక్ష్యం వహించిందని చెప్పారు. అక్రమ గంజాయి సాగు, రవాణాను కట్టడిచేసి యువత భవిష్యత్తును కాపాడాలని హోంమంత్రి నీ కోరారు. అలాగే నీటి పారుదల శాఖ మంత్రివ ర్యులు నిమ్మల రామానాయుడు కలిసి రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కారం దిశగా ఎన్డీఏ కూటమి నేతృత్వంలో వివిధ పనులు చేపట్టా లని కోరారు. సూరంపాలెం రిజర్వాయర్ కాలువ పనులు, గాదరాడ లిఫ్ట్ ఇరిగేషన్, కాటవరం లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ పనులు, బొబ్బిల్లంక పం పింగ్ స్కీమ్ రెండవ సారి టెండర్ పిలవడానికి పరి పాలన ఆమోదం ఇవ్వాలని కోరారు. బొబ్బిల్లంక నుండి పురుషోత్త పట్నం వరకు గోదావరి బండ్ రోడ్డు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయా లని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

సేవా దృక్పథంతో మెగా కుటుంబం

విశాలాంధ్ర - జగ్గంపేట : సేవా దృక్పథంతో ఉండే కుటుంబం మెగా కుటుంబం అని జనసేన పార్టీ జగ్గంపేట నియో జకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను జగ్గంపేట కృష్ణవేణి థియేటర్ వద్ద నిర్వహించి కేక్ కట్ చేశారు. తదుపరి మొక్కలను నాటి, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కిల్కరి మొబైల్ సర్వీస్ అకాడమీ ట్రైనింగ్

విశాలాంధ్ర - కపిలేశ్వరం పురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కిల్కరీ మొబైల్ సర్వీసెస్ అకాడమీ ట్రైనింగ్ కపిలేశ్వరపురం మండలంలో ఉన్న మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అంగర, వాకతిప్ప, అత్యుతాపురం, ఆశాలకు, ఏఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్పిలకు, సూర్వైజర్లకు, కపిలేశ్వరపురం ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసి అందరికీ ట్రైనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమ లోరీజినల్ అధికారి ఆర్ మోహనరావు మాట్లాడుతూ. కిల్కారీ కాల్స్ గర్భిణీ స్త్రీలు వినుట వలన మాతృ మరణాలు, శిశు మరణాలు తగ్గించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసరు రవికుమార్ మాట్లాడుతూ ప్రతీ ఆశ ఈ ట్రైనింగ్ పూర్తి చేసుకుని ప్రజలకు ఆరోగ్య అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ బిషప్, హెచ్ఇ రామరావు, ఎంపిహెచ్ కామేశ్వరరావు. మూడు పీహెచ్ల హెల్త్ విజిటర్స్, ఎమ్మెల్ హెచ్పిఎస్, ఏఎన్ఎంఎస్, ఆశాలు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా వ్యవసాయం చేయాలి

విశాలాంధ్ర - అనపర్తి : ఆంధ్రప్రదేశ్లో లక్ష ఎకరాల్లో ఏ విధం గానైనా సేంద్రియ వ్యవసాయం చేయాలనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన అని దానిని స్పష్టంగా మొన్న బడ్జెట్లో కూడా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రంగంపేట మండలం పి వీరంపాలెంలో ఆయిల్ ఫామ్ తోటల విస్తరణ మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మొక్కలను నాటారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ హితంగా వ్యవసాయం చేయాలని ఎరువులు వాడకం ఎంత తగ్గిస్తే అంత మంచిదని ఆ విధంగా కృషి చేయాలని రైతులకు ఎమ్మెల్యే నల్లమిల్లి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు పట్టివేత

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో రఘు దీపం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీతానగరం పోలీస్ సిబ్బంది అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు అక్రమంగా మట్టి ఇసుక రవాణా చేస్తున్న వారిపై ఉక్కు పాదం మోపుతానని చెప్పడమే కాకుండా చేసి చూపడంలో ముందుంటున్నారని ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐ ఫణిమోహన్ చూరు గా ఉంటూ అసాంఘిక కార్యకలాపాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు.

మహిళలకు ధృవ పత్రాలు అందజేత

విశాలాంధ్ర - దేవర పల్లి : మండలంలోని యర్నగూడెంలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ పార్డ్ ఇండియా ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన డిజిటల్ కుట్టు శిక్షణా కేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంక ట్రాజు ప్రారంభించారు. అలాగే శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 60 మంది మహిళలకు ధ్రువ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సుమారు 13 సంవత్సరాలుగా వివిధ రీతుల్లో ప్రజా సేవలో భాగస్వామ్యం అవుతూ,అలాగే ప్రత్యేకంగా మహిళాభివృద్ధికి విశేషం గా కృషి చేస్తున్న పార్డ్ ఇండియా కమిటీ సభ్యులను అభినందించారు. రాను న్న రోజుల్లో తన పూర్తి సహాయ సహకా రాలు అంది స్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్డ్ ఇండియా ఎగ్జి క్యూటివ్ కమిటీ సభ్యులు అంబటి శ్రీనివాసరావు, కారుమంచి గణేష్, దేవ రాజు అచ్యుతరావు, ఎన్.వెంకటల్, ఎస్.వెంకట్రావు, షరీఫ్, టిడిపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురిపై కేసు నమోదు

విశాలాంధ్ర - గండేపల్లి : వారం రోజులుగా గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహించగా ఆరుగురు పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఆరుగురిలో నలుగురు వ్యక్తులకు రూ.10,000 లు జరిమానా, ఇద్దరికి మూడు నెలల జైలు శిక్షను గురువారం పెద్దాపురం కోర్టు విధించినట్లు గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : పకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేస్తే నాణ్యమైన అధిక దిగుబడిని సాధించడంతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఆ దిశగా రైతులు సాగు చేపట్టాలని జిల్లా ప్రోజెక్ట్ మేనేజర్ ఇలియాజర్ సూచించారు. మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ అధ్వర్యంలో మండలంలోని గొల్లలగుంట గ్రామంలో గురువారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతుల అవసరాన్ని మించి ఎరువులు, పురుగులు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో సేంద్రియ ఎరువులు వేప కాషాయం జీవామృతం, పంచగవ్య వినియోగిస్తూ నాణ్యమైన దిగుబడి సాధించాలన్నారు. ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని డెమో ద్వారా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, పకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సేవాపథంలో మానవతా సంస్థ

విశాలాంధ్ర - దేవరపల్లి : మానవతా సంస్థ వ్యవస్థాపక దినోత్సవం వారోత్స వాల్లో భాగంగా దేవర పల్లి మండలం పల్లంట్ల గ్రామంలో గురువారం మాన వతా సంస్థ చైర్మన్ బలుసు సత్యనారాయణ విజయ లక్ష్మి దంపతులు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా మహనీయుల జీవిత చరిత్ర పుస్త కాలను, నోట్‌పుస్తకాలను విద్యార్థులకు అంద జేశారు. ఈ సందర్భంగా దేవరపల్లి లో గల జై కిసాన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఈ సందర్భంగా బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ 2004 ఆగస్టు 22వ తేదీన జంగారెడ్డిగూడెం కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ రామచంద్రా రెడ్డి మానవతా సంస్థను ఏర్పాటు చేశారని అన్నారు. తెలుగు రాష్ట్రాలలో 117 మండలాలలో 70 వేల మంది సభ్యులతో మానవతా సంస్థ సేవలు అందిస్తుందని అన్నారు. జంగారెడ్డిగూడెంలో మానవతా సంస్థ నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బలుసు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులు రూ. 10,000 అందజేశారు

రేపు మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీ శనివారం మధ్యాహ్నంమూడు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ అధ్యక్షుడు కెవికె దుర్గారావు అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో రావాలని కోరారు. అలాగే ఆయా మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

పోటీతత్వంతో విజయాలు తథ్యం

జీజీయూ రిజిస్ట్రార్ పిఎంఎంఎస్ శర్మ

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీతత్వంతో అల వర్చుకోవాలని తద్వారా విజ యాలు తథ్యమని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్ శర్మ అన్నారు. మండలంలోని గైట్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల ,తల్లి దండ్రులతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వల్లి మాధవి అధ్యక్షతన గురువారం జరి గిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ డాక్టర్ శర్మ మాట్లాడుతూ కష్టించేతత్వంతో పాటు అంకితభావంతో విద్యను అభ్యసిస్తే మంచి ఫలితాలు సాధిం చగలరని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన జిజియు డీన్ డాక్టర్ ఎన్ .లీలావతి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉం టుందని అన్నారు. సభాధ్యక్షులు గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లి మాధవి మాట్లాడుతూ అవకాశాలును అందిపుచ్చుకోవాలంటే అత్యుత్తమ సామర్థ్యాలు మంచి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలిపారు.

తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో కళాశాలలోని వివిధ విభా గాల అధిపతులు డాక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, కె. సత్య శ్రీ హరి, డి.నగేష్, మాధవి కామేశ్వరి, ఏవో బి.హెచ్. సోమశేఖరరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు

మెగాస్టార్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - జగ్గం పేట, కిర్లంపూడి : మెగా స్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను గురు వారం కిర్లంపూడి మండ లంలోని గ్రామాల్లో వాడ వాడలా నిర్వహించారు. పుట్టినరోజును పురస్కరించుకుని రామచంద్రపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ దేవాలయాల వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సుమారు 1000 మొక్కలు పంపిణీ చేశామ న్నారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల దేవాలయాల వద్ద మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ అభిమానులు మాదారపు వీరబాబు, పాలంశెట్టి రమేష్, కర్నాకుల సూరిబాబు, కాయల మణికంఠ, గోకేడ ప్రసాద్, సత్యం శెట్టి వీర గణేష్, రేపూరి శ్రీనివాస్, గోకేడ రమణ, పాలెం బాబి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో శాంతివర్ధన సేవలు

విశాలాంధ్ర - పెద్దా పురం : శాంతివర్ధన స్వచ్ఛంద సంస్థ ఇక నుంచి రైతులకూ అందుబాటులో ఉండే విధంగా మరిన్ని సేవలు అందించనుందని ఆత్మ పిడి జ్యోతిర్మయి, పశుసంవర్ధక శాఖ ఏడి తుమ్మల రామస్వామి అన్నారు. పెద్దాపురం మండలం కాండ్రకోట పశు వైద్యశాలలో గురువారం శాంతివర్ధన ఆర్గనైజేషన్, ఆత్మ, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతివర్ధన సంస్థ సిఈఓ రఘువీర్ అధ్యకతన జరిగిన రైతు సదస్సులో పీడీ జ్యోతిర్మయి, ఎడి రామస్వామి మాట్లాడుతూ ఎన్నో సామాజిక, స్వచ్ఛంద సేవలు అం దిస్తూ ముందుకు దూసుకెళుతున్న శాంతి వర్ధన సేవలు అభినందనీ యమన్నారు. రైతులకు, పాడి పశువులకు ఉపయోగపడే మినరల్ మిక్చర్ ప్యాకెట్లను, పశువుల ముందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది రైతులకు చెందిన 75 పశువులకు పశు వైద్యాధికారులు పశువులకు గాలికుంట వ్యాధి టీకాలు, గర్భ కోశ వ్యాధులకు చికిత్స అందజేసి, లేగ దూడలకి డీవార్మింగ్ మం దులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రకోట, ఆర్సి పట్నం, కిర్లంపూడి పశు వైద్యాధికారులు డాక్టర్ తోట నవీన్, డాక్టర్ రాకేష్, డాక్టర్ వినోద్, ఆసుపత్రి సిబ్బంది, శాంతివర్ధన ఏవో వేణు, దుర్గా వీరబాబు రాజేంద్ర రైతులు పాల్గొన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

విశాలాంధ్ర - కరప : కరప మండలం వాకాడ గ్రామం మెయిన్ రోడ్డు నందు జరిగిన మోటార్ సైకిల్ ప్రమాదంలో యువ కుడు మృతి చెందిన ఘటన చోటు చేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకా రం కరప మండలం పెదకొత్తూరు గ్రామానికి చెందిన దాసరి చిన్న బాబు వయసు 30 సంవత్సరాలు. ఉప్పాడ గ్రామంలో బుల్డోజర్ పై పనిచేసేందుకు ఈనెల 19వ తేదీన వెళ్లి 21వ తేదీన తన పని ముగించుకుని తిరిగి వస్తూ వాకాడ సమీపంలో తన స్ప్లెండర్‌మోటార్ సైకిల్ నుండి అదుపు తప్పి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్సై రామకృష్ణ తెలి పారు. దీనిపై చిన్నబాబు అన్నయ్య దాసరి భీమరాజు ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నేటి నుంచి గ్రామసభలు

విశాలాంధ్ర - ఉంద్రాజవరం: మండల వ్యాప్తంగా నేటి నుండి నిర్వహించే గ్రామ సభలకు సంబంధించి, మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో జీవీఎస్ ఆర్కే రాజు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలు చేపట్టనున్న అభివృద్ధి పనుల ఎంపికపై ప్రణాళిక తయారు చేయాలని, గ్రామ సభలలో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో పిఆర్‌డిజెడివి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

25 నుంచి జీ తెలుగులో ఆదివారమూ సీరియల్స్

విశాలాంధ్ర , తూర్పు గోదావరి : జీ తెలుగులో ప్రేక్షకుల ఆదరాభిమానాలతో విజయవంతంగా కొనసాగుతున్న సీరియల్స్‌ని ఇక నుంచి ఆదివారం కూడా ప్రసారం చేయడానికి సిద్ధమైందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ప్రసారమయ్యే సీరియల్స్ అన్నీ ఈ నెల 25 నుంచి ఆదివారం కూడా ప్రసారం అవుతాయన్నారు. చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి, మా అన్నయ్య, నిండు నూరెళ్ళ సావాసం, మేఘసందేశం, పడమటి సంధ్యారాగం, త్రినయని సీరియల్స్ తమ అభిమానులను అలరిస్తాయన్నారు. చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి సాయంత్రం 6 గంటలకు, మా అన్నయ్య 6:30 గంటలకు, నిండు నూరేళ్ళ సావాసం రాత్రి 7 గంటలకు, మేఘసందేశం 7:30 గంటలకు, పడమటి సంధ్యారాగం 8 గంటలకు, త్రినయని 8:30 గంటలకు ప్రసారం కానున్నాయన్నారు. మధ్యాహ్నం సీరియల్స్ మాత్రం యథాతథంగా సోమవారం నుంచి శనివారం వరకు వాటి సమయాల్లో ప్రసారమై ప్రేక్షకులను అలరిస్తాయన్నారు.ఈ నాన్ స్టాప్ సీరియల్ ట్రీట్‌తో పాటు ఈ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బ్లాక్ బస్టర్ హిట్ పిండం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌ను కూడా అందిస్తోందన్నారు.

గడ్డి మందు సేవించి విద్యార్థిని మృతి

విశాలాంధ్ర - కరప : కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన పడాల సుష్మ శ్రీదేవి వయస్సు 19 సంవత్సరాల విద్యార్థిని ప్యారా క్యూట్ గడ్డి మందు సేవించి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. తల్లి పడాల ఆదిలక్ష్మి వైఫ్ ఆఫ్ శ్రీనివాసరెడ్డి పోలీసులకు తెలిపిన ఫిర్యాదు మేరకు కోరంగి కేజిపిటిలో ఫామ్స్ డీ చదువుతున్న సుష్మ చదువులో వెనకబడిందని తల్లి మందలించడంతో 20వ తేదీన ఉదయం ఏడు గంటలకు ప్యారా క్యూట్ గడ్డి మందు సేవించి తల్లితండ్రులను బెదిరించాలని ప్రయత్నం చేసింది. మెరుగైన వైద్యం కోసం వినోదయ ఆసుపత్రి కి తరలించి చికిత్స చేస్తూండగా 21వ తేదీన మృతి చెందిందని, తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు.

మదర్‌థెరిస్సా అనాథాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర - కొవ్వూరు : అన్ని దానములలోనూ అన్నదానము ఎంతో గొప్పదని, నిరుపేదలకు అనాథలకు అన్నదానం చేయడంలో ఆత్మసంతృప్తి కలుగుతుందని తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మద్దిపాటి ప్రకాష్ రావు అన్నారు. గురువారం కొవ్వూరు పట్టణంలోని సత్యవతి నగర్ నందు గల ‘ మదర్ తెరిసా అనాథ బాలల ఆశ్రమం నందు మలకపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మద్దిపాటి ప్రకాష్ రావు కుమారుడు శ్రీనివాస్ చౌదరి, మాధురి దంపతుల కుమారుడైన చైతన్య దేవాన్ష్ 8వ పుట్టినరోజుని పురస్కరించుకొని అనాథ పిల్లలకు మధ్యాహ్నం భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో గెడ్డం వినోద్ బాబు, పసలపూడి ఏసురత్నం, గెడ్డం సంతోష్ మదర్ థెరీసా హెూం నిర్వాహకులు బేతాళ విజయ్ కుమార్ , సిబ్బంది పాలొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి : ఎమ్మెల్యే దేవ

విశాలాంధ్ర - రాజోలు : ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం రాజోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా శ్రీను అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్లు ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజోలు మండలాన్ని దీర్ఘకాలిక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వీటి పరిష్కారానికి పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమస్యలపై యుద్ధం చేయాలని సూచించారు. ఇంతవరకూ జరిగిందంతా ఇక చర్చించుకోవడం అనవసరమని, అధికారులు నిర్లక్ష్యధోరణి విడనాడి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. అలాగే తాగునీరు సక్రమంగా అందించాలన్నారు. ఇప్పటివరకూ గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందదని, ఇకపై నిధుల కోసం తాను చూసుకుంటానని అభివృద్ధిపై అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు దృష్టిసారించాలన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, ఎంపీడీవో ఎన్ బాలాజీ, జడ్పీటీసీ మట్టా శైలజా, సిఐ నరేష్ కుమార్, ఎస్ఐ రాజేష్ కుమార్, వైస్ ఎంపిపిలు ఇంటిపల్లి ఆనందరాజు, పొలమూరి శ్యాంబాబు, ఇఒపిఆర్డి జి భీమారావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ అధికారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : కలెక్టర్ ఆదేశాలతో తనిఖీలు చేస్తున్నానని నమ్మబలికి నకిలీ అధికారి అంగన్‌వాడి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసిన నకిలీ అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్లో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి మమ్మీ. ఫిర్యాదు చేశారు. ఆగస్టు ఒకటో తేదీ నుండి ఎనిమిదో తేదీ వరకు కొవ్వూరు నియోజకవర్గం లోని 21 అంగన్వాడీ కేంద్రాల్లో నకిలీ అధికారి కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్నట్టు మాయమాటలు చెప్పి సిబ్బందితో సెల్ఫీ ఫోటోలు దిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి మమ్మీ కు అంగన్వాడి కేంద్రాల టీచర్లు తెలియజేయడంతో సంబంధిత అధికారులను సిడిపిఓ మమ్మీ సంబంధిత అధికారులతో మాట్లాడి వివరణ కోరగా నకిలీ అధికారి అని తెలింది. ఈ విష యంపై విచారణ చేపట్టి నకిలీ అధికారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎఫ్ఐఆర్ కాపీని కూడా పోలీస్ స్టేషన్ నుండి తీసుకోన్నట్టు సిడిపిఓ మమ్మీ మీడియాకు తెలియజేశారు

తెలుగు జాతీయ సదస్సును విజయవంతం చేయండి

బ్రోచర్లు ఆవిష్కరించిన నన్నయ వీసీ శ్రీనివాసరావు

విశాలాంధ్ర - రాజానగరం : తమ విశ్వవిద్యాలయంలో సెప్టెంబర్ 28వ జరగనున్న తెలుగు జాతీయ సదస్సును ప్రతిఒక్కరు విజయవంతం చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నన్నయ వర్సిటీ నందు ఇందుకు సంబంధించి బ్రోచార్లను గురువారం ఉపకులపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు తెలుగుశాఖ మరియు స్ఫూర్తి కుటుంబం, ఆంధ్రప్రదేశ్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు జాతీయ సదస్సు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. తెలుగు భాషాభిమానులు,సాహిత్యవేత్తలు ప్రతి ఒక్కరు సదస్సుకు హాజరై జయప్రథం చేయాలని తెలిపారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో సైంటిఫిక్ సెయింట్‌గా ఖ్యాతి పొందిన శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి కలం నుండి వెలువడిన 40 గ్రంథాలలో ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సామాజిక వంటి భావనలు ఉంటాయన్నారు. విశ్వస్ఫూర్తి రచనలలోని వివిధ దృక్పథాలపై వ్యాస పత్రాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, సదస్సు నిర్వహణ సభ్యులు ఎస్.రజనీకాంత్, వి.సదాశివ రావు, టివిఎస్.ప్రసాద్, డాక్టర్ కెవిఎన్.డి.వర ప్రసాద్, డాక్టర్ డి.లక్ష్మీనరసమ్మ, డాక్టర్ పిబి.సంజీవ రావు తదితరులు పాల్గొన్నారు.

సాయమందించడమే మానవతా ధ్యేయం

విశాలాంధ్ర - తాళ్లపూడి : కష్టాల్లో ఉన్న వారికి ఎంతో కొంత సహాయం అందించి ఆదుకోవడం మానవతా ధ్యేయమని, అలాగే మానవతా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రపంచ శాంతి కోరుతూ, మానవతా తాళ్లపూడి శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం హై స్కూలు విద్యార్థులు తో స్కూలు వద్ద నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు అంకం సురేష్ మాట్లాడుతూ మానవతా సంస్థ సేవకు మంచి వేదిక అని, జంగారెడ్డి గూడెం లో మానవతా మూర్తి రామ చంద్ర రెడ్డి ఆలోచనలతో ఆవిర్భవించిన సంస్థా అనేక జిల్లాలో విస్తరించి సేవలు అందిస్తుందని అన్నారు. ఈ ర్యాలీని స్కూల్ ప్రిన్సిపాల్ అనిష్ జెండా వూపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో రాజశేఖర్, హనుమంతు, జోడాల్ వెంకట్, చంద్రయ్య, గుప్తా, బాబులు దుర్గ ప్రసాద్, అబ్బులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర - కరప : కరప మండలం గురజానపల్లి గ్రామంలో అనుమానస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం యాదవ కులానికి చెందిన మరుకుర్తి సత్తిబాబు సన్నాఫ్ లచ్చన్న వయసు 40 రొయ్యల చెరువుల యజమాని కర్ణాసుల సీతారామాంజనేయులు వద్ద రెండు నెలలుగా పని చేస్తూ ఉన్నాడని, ఈనెల 21వ తేదీన పని చేయడానికి వెళ్లి సాయంత్రం నాలుగు గంటల సమయంలో చెరువు అంచున నోటి నుండి నురుగులు కక్కుతూ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సత్తిబాబు తమ్ముడు మరుకుర్తి దుర్గారావుకు చెరువులు వద్ద పనిచేస్తున్న రాజు అనే వ్యక్తి సమాచారం అందజేయడంతో దుర్గారావు ఫిర్యాదు మేరకు అనుమాదాస్పద మృతి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర - కరప : సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని కరప గ్రామంలో డాక్టర్ బోండా సూర్యరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బండారు మురళి, భోగిరెడ్డి కొండ బాబు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, భోగి రెడ్డి గంగాధర్, యాళ్ళ వీర వెంకట సత్యనారాయణ, ముద్రగడ రమేష్, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్, నక్క సత్తిబాబు, పేపకాయల రాజు, పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

బోడెం దుర్గ చైతన్య, తండ్రి వెంకటరావు డోర్ నెంబర్ 1-145. ఏలూరు జిల్లా ఏలూరు 27వ డివిజన్ శ్రీరాజ రాజేశ్వరి నగర్ కాపురస్తులు అను నేను ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నేను ఒరిజినల్ **పాస్‌పోర్ట్ ఐడి నెంబర్ M. 9521753** గలది కలిగి ఉన్నాను. **ది. 17.08.2024 తేదీన** సదరు పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తము ఒక కవర్లో పెట్టుకొని మా ఇంటి దగ్గర నుండి కంఢ్రిక గూడెం సెంటర్‌కు వెళుచుండగా మార్గమధ్యంలో సదరు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పెట్టిన కవరు జారి పడిపోయినది ఎంత వెతికినా దొరకలేదు కావున ఎవరికైనను దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందజేయగలరు.

ఫోన్ నెంబర్: 88852 55332

చంద్రబాబు నిర్ణయంపై ఆటోవాలాల హర్షం

విశాలాంధ్ర - అమలాపురం : ఆటో కార్మికుల సమస్యలపై ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు తీసుకున్న నిర్ణయం పట్ల ఆంధ్ర ఆటోవాలా ఆటో వర్కర్స్ యూనియన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా. అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు హర్షం వ్యక్తం చేశారు. ఆటో కార్మికులు ప్రత్యేక అభినంద నలు తెలుపుతూ ముఖ్యంగా నిన్న ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పై ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిస్థి తులను సమీక్షించి తద్వారా ఆటో కార్మికులకు చిన్న ట్రాన్స్పోర్ట్ వెహికల్స్‌కు ఇబ్బంది లేకుండా తీసుకుంటారని మేమందరం భావిస్తూ ఆంధ్ర ఆటోవాలా ఆధ్వర్యంలో ఎన్నికల ముందు జనవరి 7వ తేదీన తలపెట్టిన నిరసన కార్యక్రమం, ఆగస్టు ఆరో తేదీన చలో కలెక్టర్ కార్యాలయాల నిరసన కార్యక్ర మంలో తీసుకున్న నిర్ణయాలు ట్రాన్స్పోర్ట్ జేఏసీ కమిటీతో ఒక కమిటీ సమా వేశం వేసి రెండు ఆటో కార్మికులకు మీరు చేసే సహాయం ముందుగా మాకు తెలపాలని కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలని ట్రాన్స్పోర్ట్ జేఏసీతో చర్చలు జరపాలని కార్యక్రమాలు చేశారు. ఆ కార్యక్రమాల ద్వారా గురువారం తీసు కున్న నిర్ణయం దగ్గరగా ఉన్నందున జిల్లా కమిటీ తరఫున ఆటో కార్మికుల తర పున అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో రాష్ట్ర ఆటో కార్మికులతో సమా వేశం ఏర్పాటు చేస్తారని భావిస్తూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కి బిజెపి నాయకులు మా విన్నపం తెలియజేస్తున్నట్లు ఆంధ్ర ఆటోవాలా అధ్యక్షులు వాసంశెట్టి సత్తిరాజు తెలిపారు.

ఘనంగా చిరంజీవి 69వ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - గండేపల్లి : పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరం జీవి 69వ పుట్టినరోజు వేడు కలు గురువారం ఘనంగా జరి గాయి. చిరం జీవి పుట్టినరోజు సందర్భంగా అభిమానులంతా వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గండే పల్లి మండలం మల్లేపల్లి, ఉప్పలపాడు గ్రామాల్లో పంచాయతీ ఆవరణ వద్ద జనసేన నాయకులు, జన సైనికులు, వీరాభిమానులు చిరంజీవి పుట్టినరోజును సంబరంలా జరుపుకున్నా రు. ఈ పుట్టినరోజు వేడు కకు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి కేకును కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. జన సైనికులు ప్రతి ఒక్కరూ దేవాలయాల వద్ద మొక్కలు నాటి తమ అభిమానాన్ని చాటు కున్నారు. తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ సినిమా రంగంలోకి ఒక్కడిగా వచ్చి కోట్లాదిమంది అభిమానులను సొంతం చేసుకున్న ఘనత చిరంజీవిది అని, ఐ బ్యాంక్ బ్లడ్ బ్యాంక్‌లను స్థాపించి పేద ప్రజలకు ఆశా కిరణంగా నిలిచారని, రాజకీయ రంగంలో కూడా ఆయన సేవలు మరువలేనివని వారి సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదు ఇచ్చి సత్కరించడం చాలా ఆనందదాయకమని రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపోయిన శ్రీను, గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రా మింగ్ కోఆర్డినేటర్ రామకుర్తి నరసింహం, మండల కార్యదర్శి వెనిది చిన్ని, బత్తుల రమణ, బలిరెడ్డి గణేష్ కుమార్, పితాని వీరబాబు, జనసైనికులు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌జీఎస్ ఆధ్వర్యంలో "ప్లాంట్ ఫర్ మదర్ "కార్యక్రమం

విశాలాంధ్ర - తాళ్ళరేవు : తాళ్ళరేవు మండలం పరిధిలోని ప్రతి పంచాయతీలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పి మల్లవరం పంచాయతీ యన్ఆర్‌జియస్ సిబ్బంది ఆధ్వర్యంలో "ప్లాంట్ ఫర్ మధర్" కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ(బాబి), గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ, దున్నా గౌతం, స్కూల్ కమిటీ చైర్మన్ నేతల నాగార్జున, సచివాలయం కార్యదర్శి పితాని శ్రీరాం, ఏపిఓ టి తేజస్విని, ఫీల్డ్ అసిస్టెంట్ మోకన మణి, మేట్‌లు స్వామి, తాతాజీ, అచ్చియ్య, అంబటి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా రైతులకు అవసరమైన పనులు గుర్తించి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

నకిలీ సర్టిఫికెట్లతో వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా ప్రమోషన్లు...!

- హౌసింగ్‌లో వెలుగుచూస్తున్న కఠోర నిజాలు, -కలెక్టర్ విచారణ చేపట్టాలని పలువురి డిమాండ్

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా హౌసింగ్ శాఖలో నకిలీలు రాజ్యమేలుతున్నారు. శాఖలో నకిలీ ధృవపత్రాలు సమ ర్పించి వర్క్ ఇనస్పెక్టర్ లు నుండి మండల ఇన్‌ఛార్జ్‌లుగా పదోన్నతులు పొందుతున్న భాగోతం వెలుగుచూసింది. దీనితో హౌసింగ్ శాఖాపరంగా పెద్ద దుమారమే రేగు తోంది. నకిలీ సర్టిఫికెట్లతో హౌసింగ్ శాఖలో అడ్డగోలుగా ప్రమోషన్లు పొందటం ఆ శాఖలో సర్వసాధారణంగా మారింది. అలాగే గత 10 నుండి 18 ఏళ్ళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కోనసీమ జిల్లాలో వర్క్ ఇన్‌స్పె క్టర్లుగా ఐటిఐ, ఇంటర్ ఒకేషనల్ కోర్సులు చేసి గృహ నిర్మాణ సంస్థలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తు న్నారని, మండల ఇన్చార్జిలుగా పనిచేయాలంటే డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్ (డిసిఇ) పాలిటెక్నిక్ కాలేజీ నందు 3 సం.లు కోర్సు పూర్తి చేసి ఉండాలని అయితే వీరందరూ నకిలీ సర్టిఫికేట్స్ ముఠా ద్వారా లక్షలాది రూపాయలు ఇచ్చి డిప్లొమా చదివినట్లు సర్టిఫికేట్స్ సంపాదించారని పలువురు బాహాటంగా ఆరోపిస్తున్నారు. వీరందరూ మం డల ఇన్చార్జిలుగా పదోన్నతి పొందడానికి ఫైరవీలు చేస్తు న్నారన్నారు. అయితే నిజాయితీగా పనిచేస్తూ క్వాలిఫై అయినా ఉద్యోగులు మాత్రం తమకున్న అర్హతలతో ఏళ్ల తరబడి అదే సీట్లలో కూలబడి ప్రమోషన్ల రాక నిస్పృహ యంగా పనిచేసుకుంటుండగా నకిలీ సర్టిఫికెట్లతో ప్రమోషన్లలో ఏగబాకుతున్న వారి ఓవర్ యాక్షన్ ఎక్కువ కావ టంతో ఇప్పటి వరకు స్తబ్దతగా వున్న రాచ పుండు పగిలీ నట్లు తెలుస్తోంది. దీనితో దశాబ్దాలుగా దాగివున్న అవినీతి పురాణం బట్టబయలు అయింది.

గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాగా ఉన్నప్పుడు కొంతమంది నకిలీ సర్టి ఫికేట్స్ సంపాదించి వర్కు ఇన్‌స్పెక్టరుగా సంస్థలో పనిచేసే కీలక ఉద్యోగంలో ఉన్న వ్యక్తికి డబ్బులు ఇచ్చి వర్కు ఇన్ స్పెక్టర్లుగా జాయిన్ అయ్యారని, అప్పటి నుండి నకిలీ సర్టి ఫికేట్‌లతో ఉద్యోగం చేస్తూ అవినీతి అక్రమాలు చేస్తూ వ్యవస్థ, చట్టం ముందు వీసమెత్తు భయం లేకుండా ఉద్యో గంలో కొనసాగుతున్నారు. వారే మరలా నకిలీ డిప్లొమా సర్టిఫికేట్స్ సంపాదించి పదోన్నతులు పొందుటకు సిద్ధం అవుతున్నారనీ పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఈ నకిలీ సర్టిఫికేట్‌లతో ఉద్యోగం చేస్తున్న వారిని ఎం క్వయిరీ చేసి సంస్థకు, వ్యవస్థను మోసం చేసినవారిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్‌చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: లింగ గ్రంధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. గురువారం స్థానిక కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అధ్యక్ష తన పి.సి అండ్ పి.ఎన్.డి.టి చట్టం అమలుపై జిల్లా ఎస్.పి. అద్నాన్ నయీమ్ అస్మితో కలసి జిల్లా కలెక్టరు సమావేశాన్ని నిర్వహించడం జరి గింది. జిల్లాలో కొత్తగా 9 మంది అల్ట్రా స్కానింగు సెంటర్ల కోసం అప్లై చేసిన దరఖాస్తులను దొడ్డిపట్ల, లింగబోయినచర్ల,యండగండి, పోడూరు, అత్తిలి గ్రామాల పీహెచ్‌సీలకు, భీమవరం 1, తాడేపల్లి గూడెం 2, పాలకొల్లు 1 ప్రైవేటు స్కానింగు సెంట ర్లను ఆమోదించారు. ప్రతి ఐదు ఏళ్లకు ఒకసారి స్కానింగు సెంటర్లు రెన్యూవల్ కోసం వచ్చిన నాలుగు సెంటర్లను ఆమోదించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ 15, ప్రైవేటు 131 మొత్తం 146 స్కానింగ్ సెంటర్లను క్రమం తప్పకుండా సెంటర్ల ను, దస్త్రాలను తనిఖీ చేసి పూర్తిస్థాయిలో నివేదికలు అందజేయాలన్నారు.లింగ నిర్ధారణ పరీక్షలు చేయ డం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యలకు ఎవరు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవ డం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ లింగ నిర్ధారణ పరీక్ష నిషేధిత చట్టం గురించి తెలుసుకుని అవగాహన చేసుకోవాలన్నారు. ప్రతి ఆడబిడ్డ జన్మించడానికి, ఎదగడానికి, చదవడానికి సమాజం లో ఉన్న ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఐఎంఏ, పోలీసు టీమ్ లుగా ఏర్పడి డెకాయ్ ఆప రేషన్ లను నిర్వహించాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు వారి దృష్టికి వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామ న్నారు. జిల్లాలో మొత్తం 146 అల్ట్రా స్కానింగు సెంటర్లు పనిచేస్తున్నాయని, వాటిలో ప్రభుత్వం ఆస్పత్రిలో 15, ప్రైవేట్ ఆస్పత్రిలలో 131 ఉన్నాయ న్నారు. కొత్తగా అల్ట్రా స్కానింగు సెంటర్లు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ల్యాబ్స్, హాస్పటల్ ను పక్కాగా తనిఖీ చేయాలని, అప్పుడే ఆయా దరఖాస్తు పెట్టుకునుటకు అనుమతి ఇవ్వాలన్నారు. ఆడపిల్లలు నిష్పత్తి తక్కువగా ఉన్న గ్రామాలలో ప్రత్యేక నిఘా పెట్టి, అక్కడ వారికి అవగాహన కల్పించి బాలికల నిష్పత్తిని పెంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా యస్పి అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.డి మహేశ్వర రావు, అడిషనల్ డియంహెచ్ వో డా. బి భాను నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.దేవ సుధాలక్ష్మి, నరసాపురం డిప్యూటీ డియంహెచ్వో వాకపల్లి ప్రసాదు, ఐఆర్సియస్ చైర్మన్ డా. ఎం.ఎస్.వి. ఎస్ బద్రి రాజు, మెడికల్ ఎక్స్పర్ట్స్ గైన కాలజిస్ట్ డా.మాధురి, పెథాల్ జిస్ట్ డా. కిరణ మయి, ఎన్జీవో జి. శ్రీదేవి, ఏపియంసిఐ కమిటీ సభ్యులు డా.యువికె సోమరాజు, డా.వి.సూర్యనా రాయణ రాజు, డిప్యూటీ డెమో అనంతలక్ష్మి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటరు కళ్యాణి కుమారి పాల్గొన్నారు.

గ్రామ సభల్లో ఉపాధి హామీ పనుల కోసం సమీక్ష

విశాలాంధ్ర - కరప : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 23వ తేదీన జరుగు ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ అనుబంధ జాబితా వివరాలపై గ్రామ సభలో చర్చించడం జరుగుతుందని ఎంపీడీవో కె అప్పారావు తెలిపారు. వ్యవసాయ అనుబంధ పనులను చేయించేందుకు ప్రజ లకు తెలిసేలా ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహా యకులు 2024-25 సంవత్సరాల పనులకు గాను ప్రజలకు తెలియజే యాలన్నారు. కాలవలు తవ్వడం, కొత్త కాలువలు నిర్మించడం, పండ్లతోటలు పెంపకం, పట్టుపురుగుల పెంపకం, కందకాలు తవ్వడం, పండ్ల తోటలకు, బర్రెలకు, గొర్రెలకు షెడ్లు నిర్మాణం ఫెన్సింగ్, ఎలా 22 పనులు వ్యవసాయ అనుబంధ జాబితాలో పొందుపరచడం జరిగిందని ఎంపీడీవో తెలుపారు.

మెగాస్టార్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - కొత్తపేట : ఆంధ్రుల అభిమాన నటుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా కొత్తపేట సత్య చంద్ర థియేటర్ వద్ద జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ తనయుడు బండారు సచిన్ ఆధ్వర్యంలో మెగా అభిమానులు వేడుకలు నిర్వహించారు. చిరంజీవి అనే పేరు చిన్న పెద్ద తేడా లేకుండా తెలుగువారందరికీ ఒక ఎమోషన్ అని స్వయంకృషితో ఉన్నత స్థానానికి ఎదుగాలి అనుకునే వారికి ఆయన ఒక ఇన్సిరేషన్ అని ఈ సందర్భంగా బండారు సచిన్ వ్యాఖ్యానించారు. అభిమానుల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎయిడ్స్ పై అవగాహన

విశాలాంధ్ర - గొల్లప్రోలు : పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు పట్టణంలో మాధురి విద్యా లయ పాఠశాలలో విద్యారు లకు ఎయిడ్స్ నిర్మూలన పై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమం చేంజెస్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహించారు. ఇంట ర్మీడియట్ విద్యార్థులకు మీకు తెలుసా అంటూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి ఏ విధంగా ప్రజలకు సోకుతుంది వ్యాధి సోకిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని రక్త మార్పిడి ద్వారా లైంగిక సంబంధాల ద్వారా ఈ వ్యాధి సోగుతుందని తగిన జాగ్రత్తలు పాటిస్తే ఎయిడ్స్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుందని ప్రోగ్రా మ్ మేనేజర్ దుర్గాభవాని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిని అంటరాని వారిగా చూడకూడదని వారు మనందరిలో మనిషేనని కొన్ని సందర్భాల్లో మనకు తెలియకుండానే వ్యాధి సోకుతుందని తప్పనిసరిగా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. గర్భిణులు తప్పనిసరిగా ఎయిడ్స్ పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధురి విద్యాలయ కరస్పాండెంట్ కదారి తమ్మయ్య నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజల్ని ఎయిడ్స్ వ్యాధి పట్ల మరింత చైతన్య పరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు అర్బన్ పీహెచ్సీ డాక్టర్ రామ్ కుమార్, ఎంపీహెచ్వోలు భాష, శ్రీనివాస్ పిఠాపురం పీహెచ్సీ ఐసీటీసీ సిబ్బంది లక్ష్మి, సరస్వతి, శ్రీలత, గాయత్రి, శ్రీజ, లలిత , కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.